

# భారతీయ సినిమాల్లో స్త్రీమూర్తులు

వారాల ఆనంద్



ఈ రోజుల్లో ఐతే చాలా సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం ఆటబొమ్మలుగా ఉంటున్నాయి కానీ దశాబ్దాలుగా వచ్చిన ఇండియన్ సినిమాని పరిశీలిస్తే స్త్రీ పాత్రలకి పెద్దపీట వేసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అన్ని భారతీయ భాషలనుంచీ స్త్రీ పాత్రలని ప్రధానంగా చిత్రీకరించిన ఉత్తమ సినిమాల పరిచయాలు .. నెలకి రెండు సినిమాల చొప్పున.

కళాత్మక చిత్రాభిమాని ఆనంద్‌గారు కవి, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత, దర్శకులు కూడ. ఒక కవితా సంపుటిని, సినిమాల మీద నాలుగు పుస్తకాలని రచించారు. కళాత్మక చిత్రోత్సవాల నిర్వహణలో విశేషానుభవం ఉంది. **varalaanand**@hotmail**.com**

## చక్ర

**భాష:** హిందీ, **దర్శకత్వం** - రవీంద్ర ధర్మరాజ్, **నటీనటులు** - స్మితాపాటిల్, నసీరుద్దీన్ షా, కులభూషన్ ఖర్బందా

**విడుదల:** 1981




**మహానగరాల్లో భవంతుల నీడన విస్తృతంగా పరుచుకున్న** మురికివాడల్లో నివసించే జనజీవితాన్ని సూటిగా, స్పష్టంగా రికార్డు చేసిన చిత్రం 'చక్ర'. ఆ మురికివాడల్లో నివసించే ప్రజల మధ్య సజీవంగా నిలిచి ఉన్న సంబంధాల్ని, కుహనా విలువలకు తావులేని వారి స్త్రీ పురుష సంబంధాల్ని 'చక్ర' అత్యంత నిజాయితీగా విశదం చేసింది. ముఖ్యంగా 'చక్ర'లో స్మితాపాటిల్ పాత్ర (అమ్మ) అన్ని ముసుగుల్ని తగులబెడ్తుంది. జీవితాన్ని ఎదురించి వాస్తవంగా జీవించడం ఆ పాత్రలో మనకు కనిపిస్తుంది. అంతే వాస్తవంగా చిత్రంలో స్మిత పాత్ర చుట్టూ అల్లుకుని ఉన్న అన్ని పాత్రలూ మురికివాడల ప్రపంచాన్ని మన కళ్ళముందుంచుతాయి. 'చక్ర'ను కళాత్మకంగానూ, ఉన్నది ఉన్నట్టుగానూ చిత్రీకరించడంలో దివంగత దర్శకుడు రవీంద్ర ధర్మరాజ్ విజయం సాధించారు.

చక్ర చిత్రంలో ప్రధానంగా మురికివాడల జీవితాన్ని యదార్ధ దృక్పథంతో చిత్రించడం ఒక

స్థాయిలో ప్రధానాంశం అయినప్పటికీ మరో స్థాయిలో మానవ సంబంధాల్ని, అక్కడి స్త్రీ జీవితాల్లోని పలు కోణాల్ని వివరించడం కూడా స్పష్టంగా కనిపిస్తుంది. అంతేకాకుండా చక్రలో మురికివాడల వాతావరణాన్ని అమూలాగ్రం అత్యంత శ్రద్ధతో చిత్రించడం జరిగింది. అక్కడ నివసించే ప్రజల జీవితాలకు సంబంధించిన ఏ చిన్న వివరమూ వదిలిపెట్టకుండా చిత్రంలో పొందుపర్చారు. అక్కడ డబ్బు సంపాదించేందుకు సినిమా థియేటర్ల వద్ద బ్లాకులో టిక్కెట్లమ్మడం, రైల్వే వాగన్లలోంచి సామాన్లు దొంగలించడం ఎంత సులువుగా చేస్తారో అంతే సామాన్యంగా వ్యభిచారమూ జరుగుతుంది. భుక్తికోసం డబ్బు సంపాదించే క్రమంలో వ్యభిచారం అక్కడ సాధారణ విషయంగానే పరిగణిస్తారు. అనేక సార్లు వీధులు ఊడ్చే మున్సిపల్ సిబ్బందికి చెత్తకుండీల్లో గుర్తు తెలీని పసిబిడ్డలూ దొరుకుతూ ఉంటారు. అలా దొరికిన రోజున ఆ మరుసటి రోజు దానిమీద చర్చ జరుగుతుంది. ఆ తర్వాత అంతా మామూలే.

అలాంటి వాతావరణంలో అమ్మ అని పిలవబడే ఓ అందమైన స్త్రీ తన కొడుకుతో జీవిస్తూ ఉంటుంది. ఆమె ఈ లోకంపైన ధిక్కారంతో బతుకుతుంది. ఎవరికీ దేనికీ బెదరకుండా తన జీవితాన్ని కొనసాగిస్తూ ఉంటుంది. పొట్టకూటికోసం ఆమె పలువురితో సంబంధాలు ఏర్పరచుకుంటుంది. అయితే ఆమె గుడిసెలో పురుషుడితో ఉన్నప్పుడు ఆమె కొడుకు మౌనంగా బయట పడుకుంటాడు. కానీ ఆమె మాత్రం తన కొడుకు ఎలాంటి చెడుకీ లోనుకాకుండా ఇజ్జత్‌తో బతకాలని ఆశిస్తుంది. అదే మురికివాడలో నివసించే అంజలి దినమంతా మామూలు జీవితం గడుపుతూ రాత్రిళ్ళు రెడ్‌లైట్ ఏరియాకి వెళ్ళి తెల్లారేసరికి గుడిసె చేరుతుంది. తనకూ తన తండ్రికీ సరిపడ డబ్బును ఆమె సంపాదిస్తుంది. అలాంటి ఆమెకు పుట్టిన చిన్నారిని చెత్త కుండీలో  వేసి తన వేదనను దుఃఖాన్ని దిగమింగుతుంది. ఇలా చక్రలోని రెండు స్త్రీపాత్రలూ భిన్నమైన వ్యక్తిత్వాన్ని ప్రదర్శిస్తాయి. అమ్మ సంఘాన్ని దిక్కరించి జీవితాన్ని గడిపితే అంజలి అందుకు భిన్నంగా సంఘానికి భయపడుతూ తన జీవితాన్ని గడుపుతుంది. జీవితంలోని రెండు భిన్నమయిన వాస్తవాలు చక్రలో అత్యంత నిజాయితీగా చిత్రితమయ్యాయి.

ఇదిలా ఉంటే మరో స్థాయిలో మురికివాడ ప్రజల ఆర్థిక స్థితిని ప్రవృత్తిని చక్రలో చర్చిస్తాడు రవీంద్ర ధర్మరాజ్. చిత్రంలో మరో ప్రధాన పాత్ర లూకా(నసరుద్దీన్ షా) అతను తాగుడు, వ్యభిచారం, బ్లాకులో సినిమా టికెట్లమ్మడం నుంచి అనేక పనులు చేస్తూ ఉంటాడు. ఛాలెంజ్ అయిన పనులు నిర్వర్తిస్తూ జల్సాగా కనిపించే లూకా ఆ మురికివాడల పిల్లలకు ఆదర్శంగా కనిపిస్తాడు. అన్నిరకాల పనులు చేసే లూకాకి బెన్వా అనే పిల్లాడు అతి సన్నిహితంగా మసులుతూ ఉంటాడు. బెన్వా అమ్మ కుమారుడుని తనతో తిప్పుతూ తన ధోరణిలో తాను తెలుసుకున్న జీవిత సత్యాల్ని ప్రభోదిస్తూ ఉంటాడు. కానీ అమ్మ తన కొడుకుకి ఇజ్జత్‌తో బతకాలని చెబుతుంది. ఓ రాత్రి లూకా అమ్మతో గడుపుతాడు. తన కొడుకు చెడుపనులు చేయడానికి అమ్మ అంగీకరించదు. లూకా వెళ్ళిపోతాడు.

అమ్మ ఆ తర్వాత లారీ డ్రైవర్‌తో సంబంధం ఏర్పరుచుకుంటుంది. ఆమె గర్భవతి అవుతుంది. లారీ డ్రైవర్‌తో జీవితాన్ని శాశ్వతంగా పంచుకుందామనుకుంటుంది. ఇంతలో లూకా తిరిగి వచ్చి తాగడానికి మందుకోసం ఓ కెమిస్ట్‌ని చంపుతాడు. పోలీసులు అమ్మ ఇంట్లో తలదాచుకున్న లూకాని అరెస్టు చేసి తీసుకు వెళతారు. రకరకాల చెడుపనులకు వేదిక కావడంతో పాటు అనవసరమైన అల్లర్లకు పాల్పడుతూ ఉన్నారనే నెపంతో ఆ మురికివాడను బుల్డోజర్లతో కూలదోయించి సువిశాలమైన మైదానంగా మార్చివేస్తారు అధికారులు. 'చక్ర' మురికివాడల జీవితాల్ని అందులో ముఖ్యంగా అమ్మ, అంజలీ లాంటి స్త్రీల వ్యదార్థమైన జీవితాల్ని యదార్థంగా చూపించింది.

●●●

# రిహాయీ

**సంగీతం** – షారంగ్ దేవ్; **నిర్మాణం** – ఎన్.ఎఫ్.డి.సి, **దర్శకత్వం** – అరుణరాజ్, **నటీనటులు** – హేమామాలిని, నసీరుద్దీన్ షా, వినోద్ ఖన్నా, నీనాగుప్తా ఇలా అరుణ్, రీమాలాగూ, అచ్యుత్ పాత్ దార్

**విడుదల:** 1988




**వర్తమాన పితృస్వామ్య సమాజంలో** స్త్రీలు రోజూ ఎదుర్కొంటున్న అనేక సమస్యల్లో లైంగిక హింస చాలా ఉంటుంది. కుటుంబంలోనూ, సమాజంలోనూ మొత్తంగా రాజ్యంలోనూ మాటలద్వారా సంజ్ఞుద్వారా, చర్చల ద్వారా, స్త్రీని కట్టడి చేసేందుకు తమ ఆధీనంలో ఉంచుకునేందుకు అనేక ప్రయత్నాలు జరుగుతూ ఉంటాయి. అందులో లైంగిక అంశం ప్రధానమయిన విషయంగా ముందుకు వస్తుంది. ఊపిరి తీసుకోవడం నుంచి మొదలు ఊర్లో నివసించడం వరకు 'క్యారెక్టర్' అన్న ఒక్క మాటలో స్త్రీపై తన నియంత్రణను అమలు చేస్తుందీ సమాజం. అంతేకాదు స్త్రీ సమానత్వం, స్వేచ్ఛ అనే మాటలు వినగానే అవి స్వేచ్ఛ ఎజెండాలో వారి ఆలోచన, అనుభవం, స్పందన, స్నేహం లాంటివి ఉంటాయన్న భావనని ఈ సమాజం ప్రోత్సహించదు.

అంతేకాదు లైంగిక పరమైన అవసరాలు జీవరసాయనిక ఆవశ్యకతలుగా ఈ సమాజం గుర్తించదు. ఆ అవసరాల్ని కేవలం వ్యక్తిగతమయిన కోణంలోంచి పరిశీలించడమే జరుగుతున్నది. అందునా లైంగిక పరమయిన అవసరాల విషయంలో స్త్రీ, పురుషులిద్దరికీ అమితమయిన తేడాల్ని నిర్దేశిస్తుందీ సమాజం. కట్టడిలేని స్వేచ్ఛాయుతమయిన స్థితిని పురుషులకోసం అట్టిపెట్టిన ఈ లోకం స్త్రీ విషయానికి వచ్చినప్పుడు భిన్నమయిన గొంతుతో మాట్లాడుతుంది. విచిత్రంగా ప్రవర్తిస్తుంది.

కుటుంబాన్ని మన సమాజానికి ఒక యూనిట్‌గా తీసుకున్నప్పుడు ఇతరత్రా అన్ని విషయాల్లోలాగే లైంగిక పరమయిన అవసరాల విషయంలో భార్యాభర్తలిద్దరూ సమబాధ్యులే. కానీ భర్త నుంచి పొందలేనప్పుడు ఒక స్త్రీ తన లైంగిక అవసరాన్ని తీర్చుకుంటే ఈ సంఘం ఆ భార్యను అనేక పేర్లతో పెట్టి హింసిస్తుంది. కానీ అదే తరహాలో పురుషుడు పరాయి స్త్రీతో తన అవసరాలు తీర్చుకుంటే సంఘం అంత తీవ్రంగా ప్రతిస్పందించదు. అనేక సందర్భాల్లో తన మౌనంతో అంగీకార ముద్రను కూడా వేస్తుంది. ఈ స్థితి మన సమాజంలోని ఉన్నత, మధ్య కింది తరగతికి చెందిన అన్ని స్థాయిల్లో కొద్దో, గొప్పో తేడాలతో విలసిల్లుతూనే ఉంది.

సరిగ్గా ఈ విషయాన్నే మౌళికాంశంగా తీసుకుని ప్రముఖ మహిళా దర్శకురాలు అరుణ రాజె 'రిహాయీ' చిత్రం నిర్మించారు. భర్తలు పనికోసం నెలలకొద్దీ నగరాలకు వెళ్ళినప్పుడు ఊర్లల్లో ఉండే స్త్రీల శారీరక, మానసిక అవసరాల్ని వాటిని తీర్చుకోవడానికి వారికి ఏర్పడే వివాహేతర సంబంధాలు. ఆ సందర్భాలకి సమాజం ప్రతిస్పందించే తీరు ఈ చిత్రంలో నిజాయితీగా చర్చించబడింది. అదే నగరాల్లో భర్తలు వ్యభిచార గృహాలకు వెళ్ళిన విషయాల్ని ఈ సమాజం ఏ విధంగా స్పందించింది కూడా 'రిహాయీ' చిత్రం చర్చిస్తుంది. భారతీయ ప్రధాన స్రవంతి చిత్ర ప్రపంచంలో ఇలాంటి అంశాన్ని తీసుకుని చిత్రం నిర్మితమవడం 'రిహాయీ'తోనే మొదలు. నిజానికి

రిహాయీ అటు ప్రధాన స్రవంతి తరహాకూ, ఇటు నవ్య చిత్ర తరహాకూ చెందని మధ్యేవాద చిత్రం. ఇందులో నాలుగు పాటలు, మేలానృత్యమూ ఉన్నాయి. హేమామాలిని, నసీరుద్దీన్ షా, వినోద్ ఖన్నాలు ప్రధాన భూమికలు పోషించిన ఈ చిత్రం గుజరాత్ రాష్ట్రానికి చెందిన సులూర్ గ్రామాన్ని బేస్ చేసుకుని నిర్మితమయింది.

అరుణ రాజె గుజరాత్ రాజస్థాన్ రాష్ట్రాల్లో కొన్ని ఆడ్ ఫిల్మ్ నిర్మిస్తుండగా జరిగిన ఒక యధార్ధ సంఘటనను విని ఈ సినిమాను రూపొందించారు. 'రిహాయీ' ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పరంగా గొప్ప చర్చనీయాంశ చిత్రం కాకపోనప్పటికీ ఆ సినిమా డీల్ చేసిన సబ్జెక్ట్ చర్చనీయాంశమయింది. చిత్ర కథాంశం విషయానికి వస్తే సులూర్ గ్రామంలో పురుషులంతా పనికోసం పట్నాలకు వెళతారు. వారి భార్యలు ఒంటరిగా ఆ గ్రామంలో నివసిస్తూ ఉంటారు. తోడులేక, సహచరుల్లేక, కష్టసుఖాలు చెప్పుకునే తనవాడు లేక ఆ గ్రామీణ మహిళలు తీవ్రమయిన ఒంటరితనాన్ని అనుభవిస్తూ ఉంటారు. ముసలి వాళ్ళను చూసుకోవడం, పిల్లల్ని పోషించడమే వారి ప్రధాన వ్యాపకంగా ఉంటుంది.

దుబాయిలో కొంత కాలం పనిచేసి తిరిగి వచ్చిన వడ్రంగి నసీరుద్దీన్‌షా ఊర్లో షోగ్గా తిరుగుతూ ఉంటాడు. ఆ ఊర్లో ఒంటరిగా ఉన్న ఆడవాళ్ళని ఆకర్షిస్తూ సంబంధాలు ఏర్పరచుకుంటూ ఉంటాడు. కాని ఆ ఊర్లోనే నివసిస్తున్న హేమామాలిని షాని వ్యతిరేకిస్తుంది. లొంగేందుకు అంగీకరించదు. కానీ అతని తీవ్ర ప్రయత్నాల తర్వాత ఆమెకూడా లొంగిపోతుంది. ఆ ప్రాంతంలో ఆడపిల్లల్ని కనడం శాపంగానూ మగపిల్లల్ని కనడం వరంగానూ భావిస్తుంటారు. హేమామాలినికి అప్పటికే ముగ్గురు ఆడపిల్లలుంటారు. ఆమె భర్త వినోద్ ఖన్నా పట్నంలో ఉంటాడు. హేమాకి నాల్గవ సంతానం మగపిల్లవాడే పుడతాడని జ్యోతిష్యుడు చెబుతాడు. ఇంతలో భర్త ఇంటికి తిరిగి వచ్చే సమయం రానే వస్తుంది. సరిగ్గా అప్పుడే తాను గర్భవతినయినట్టు హేమా తెలుసుకుంటుంది. భర్త రాకముందే అబార్షన్ చేయించుకోమని మిత్రురాండ్లు చెబుతారు. కానీ నాల్గవ సంతానం తప్పకుండా మగపిల్లవాడని ఒక ప్రక్క, మరోపక్క తనలో భాగంగా ఎదుగుతున్న పిండాన్ని తానుగా చంపలేనని భావించిన ఆమె అబార్షన్‌కు అంగీకరించదు. భర్త వినోద్ ఖన్నా కూడా ముందుకు వచ్చి భార్యను స్వీకరిస్తాడు. మంచినీ, చెడునూ రెంటినీ స్వీకరిస్తానని 'మర్దానగీ' అంటే అదేనని ప్రకటిస్తాడు. చిత్రం చివర్లో భర్త క్షమించడం, స్వీకరించడం లాంటి అంశాలతో 'రిహాయీ' మళ్ళీ మామూలు చిత్రం స్థాయికి జారిపోతుంది.

మన సమాజంలో వివాదస్పదమయిన విషయాన్ని విజ్ఞతతో చర్చకు తెచ్చి ప్రతిభ కనబర్చిన అరుణరాజె చివర్లో మళ్ళీ సాధారణ సినిమా స్థాయిలో ముగించి వేసింది. ఆమె వైఫల్యంగానే చెప్పుకోవచ్చు. అయితే సబ్జెక్టు ఎంచుకున్న తీరులోనూ చివరిదాకా నడిపించిన తీరులో అరుణ రాజె మంచి ప్రతిభనే కనబర్చారు. ఎన్.ఎఫ్.డిసి. ఆర్థిక సాయంతో నిర్మితమయిన ఈ చిత్రంలో గుజరాతీ గ్రామీణ వాతావరణం, ఆ ప్రాంత మనుషుల తీరూ తెన్నూ బాగా డాక్యుమెంట్ అయ్యాయి.

లైంగిక విషయాల్లో ఈ సంఘం స్త్రీ పురుషుల మధ్య చూపించే భిన్న విలువల్ని ప్రస్ఫుటం చేసిందనే చెప్పుకోవచ్చు.

●●●

Click here to share your comments on this article.